వెలవెల బోతున్న పీహెచ్‌సీలు

- పల్లెల్లో ఆగిన వైద్యసేవలు
- జీవో 85 రద్దు కోరుతూ విధులు బహిష్కరించిన వైద్యులు
- జిల్లాలో 76 మంది వైద్యులు లేక రోగుల ఇక్కట్లు
- ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్తున్న అభాగ్యులు
- సీజనల్ వ్యాధులతో పాటు విజృంభిస్తున్న విషజ్వరాలు
- దోచుకుంటున్న ప్రైవేట్ వైద్యశాలలు



వీరఘట్టం పీహెచ్‌సీ

పార్వతీపురం టౌన్: వైద్యులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఇబ్బందులు తెచ్చి పెట్టే జీఓలు తీసుకొచ్చి వారి సహనానికి పరీక్ష పెడుతోంది. దీంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల పీజీ సర్వీస్ కోటాను కుదిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 85 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు సేవలు బహిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయపార్వతికి ఈ మేరకు సమ్మె నోటీస్ అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని పెద్దఎత్తున నినాదాలు చేసి వైద్యులందరూ తమ హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా కలిసికట్టుగా చేపట్టిన ఆందోళన విజయవంతం చేశారు. దీంతో ఈనెల 18వ తేదీ జీఓ నంబర్ 85 తో పాటు వివిధ డిమాండ్లపై ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల అసోసియేషన్‌తో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఆ చర్చలు పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. దీంతో గత్యంతరం లేక సమ్మెను కొనసాగిస్తున్నారు. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్ వంటి ఇతర ముఖ్యమైన సమస్యలపై వైద్యులు ప్రశ్నించినా ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ ప్రభావం పీహెచ్‌సీలపై పడుతోంది.

ఆస్పత్రులకు వచ్చి వెనక్కి వెళ్తున్న రోగులు

ఆస్పత్రులకు వచ్చిన రోగులు తిరిగి వెళ్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. మండల కేంద్రాల్లో ఎంబీబీఎస్ వైద్యులు ఉండే ప్రైవేట్ ఆస్పత్రులు కూడా ఉండవు. చిన్న చిన్న రోగాలకు ఆర్‌ఎంపీలను సంప్రదించినా తీవ్రమైన రోగాలు ఉన్న పేదవారు డబ్బు ఖర్చు చేసి ఎటువెళ్లాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక రోగంతో ఒక్కో పీహెచ్‌సీకి సుమారు 80 నుంచి 100 ఓపీ వస్తుంటుంది. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్తున్నారు, దీంతో వైద్యులు లేక ఆస్పత్రులు వెలవెల బోతున్నాయి. సిబ్బంది ఉన్నా డాక్టర్ మందులు రిఫర్ చేస్తేనే వైద్యం చేసేందుకు వీలవుతుంది. దీంతో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు ఖర్చు చేసి వైద్యం చేయించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.


వీరఘట్టం పీహెచ్‌సీలో వైద్యుడులేక ఖాళీ కుర్చీ


దొకిశీల పీహెచ్‌సీలో రోగులు లేక ఖాళీగా ఉన్న బెడ్‌లు


పార్వతీపురం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

గత్యంతరం లేకనే సమ్మెబాట



నిజానికి మేం ఎప్పుడో సమ్మె చేయాలనుకున్నాం. సరిగా అప్పుడే రాష్ట్రంలో వరదలు వచ్చాయి. కోవిడ్‌లో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించిన మేము ఇలాంటి పరిస్థితిలో సమ్మె చేయడం భావ్యం కాదని వాయిదా వేసుకున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నాం. ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి.

– డాక్టర్ వినోద్ కుమార్, పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

37 పీహెచ్‌ల్లో ఆగిన వైద్యసేవలు

జిల్లాలో మొత్తం 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఇద్దరేసి వైద్యులను గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. వారితో పాటు ఇతర వైద్యులు కలిపి 76 మంది విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల పాలుట్ల అటవీ ప్రాంతంలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారంటే ప్రజల ప్రాణాలకు ఎంతగా ప్రాధాన్యం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని 37 ప్రాథమిక వైద్యశాలల్లో రోజుకు కనీసం 7 వేల నుంచి 10 వేల మంది వరకు వైద్య చికిత్సలు పొందుతున్నారు. వారంతా సామాన్య నిరుపేదలు, మధ్య తరగతికి చెందిన రైతులు, రైతు కూలీలే. ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి వేలకు రూ.వేలు ఖర్చుచేసే స్థోమత లేనివారే. ఇప్పుడు వీరి పరిస్థితి ఏమిటి? వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలి



పీజీ వైద్య విద్యలో ఇన్సర్వీస్ కోటాను కుదిస్తూ జారీ చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వైద్యులకు అలవెన్సు ఇవ్వాలి. జీఓ 85 రద్దుపై స్పష్టత వచ్చే వరకూ నిరసనలు తెలుపుతాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి. మా న్యాయ పరమైన డిమాండ్‌లు పరిష్కరించాలి.

– డా. జి. హరికృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు, మక్కువ

ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి



ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్ వంటి ఇతర ముఖ్యమైన సమస్యలు పరిష్కరించాలి. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులలో మేము చేసిన సేవలు ప్రభుత్వం గుర్తించక పోవడం అన్యాయం. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరిస్తుందని బావిస్తున్నాం.

– డా. ప్రదిప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు, వీరఘట్టాం

దోచుకుంటున్న ప్రైవేటు వైద్యశాలలు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. అవసరాన్ని బట్టి వైద్యాన్ని వ్యాపారంగా మార్చి వసూలు చేసే వైద్యశాలలకు పేదలు వెళ్లాలంటే తమ స్థోమతకు మించిన పనే. ప్రైవేట్ వైద్య శాలల్లో మందులకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కూలీనాలీ చేసుకునే పేదలు ఆ డబ్బు చెల్లించలేక ప్రభుత్వ వైద్యం అందించే వారు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు బదిలీ


మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను ఏపీ సెక్రటేరియట్‌కు బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మున్సిపాలిటీలో ఎన్నికల నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన స్థానంలో పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ శాంత కుమారిని నియమించారు. ఇప్పటివరకు ఆమె శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు.

తిరుపతి లడ్డుపై విష ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు పథకాలు అటకెక్కాయని, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టి మరల్చేందుకు గత ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలకు కూటమి ప్రభుత్వం తెరలేపుతోందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన "సాక్షి"తో మాట్లాడారు. అత్యంత పవిత్రమైన టీటీడీని భ్రష్టు పట్టించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. లడ్డూ వ్యవహారంపై దేశ ప్రధానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాసిన తర్వాత చంద్రబాబు ప్రెస్‌మీట్‌లో పేర్కొన్న అంశాలను దుయ్యబట్టారు. లడ్డూ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాయగానే చంద్రబాబు కల్లుతాగిన కోతిలా గెంతడం ప్రారంభించారని, చంద్రబాబు చేసిన తప్పుడు ఆరోపణల వల్ల రాష్ట్రమే కాదు, దేశం మొత్తం హిందూ సమాజంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందన్నారు.

తుఫాన్ బాధితులకు విరాళం అందజేత


ఎమ్మెల్యే విజయ చంద్రకు విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: మండలంలోని డోకిశీల గ్రామస్తులు విజయవాడ తుఫాన్ బాధితుల కోసం రూ.37,500 ఆర్థిక సహాయాన్ని సోమవారం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున విరాళాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ డోకిశీల గ్రామ అధ్యక్షుడు నీలాపు చంటి, నీలాపు కొండలరావు, వార్డు మెంబర్ వెంపటాపు సాంబమూర్తి, ఎక్స్ సర్పంచ్ టీడీపీ నాయకులు శ్రీధరపు రాజు, సీనియర్ నాయకులు బలుసు నాగయ్య, బొమ్మ గౌరునాయుడు దండాసి సన్యాసులు, నీలాపు రామకృష్ణ, బలుసు మురళి, తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని నిడగల్లులో గుండెపోటుతో అకాలమరణం చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త తెంటు అప్పలనాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అప్పలనాయుడు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, పార్టీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, మాజీ ఎంపీపీ ఎస్.ప్రసాద్‌పాత్రుడు, గాజాపు శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, బి. ముకుంద, వై గోపాల్, టి.అచ్యుతరావు పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి


సేంద్రియ పద్ధతిని పరిశీలిస్తున్న ట్రైనర్ యశోద, రిసోర్స్ పర్సన్లు

సాలూరు రూరల్: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని అలా అయితేనే మానవ జాతి మనుగడ ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ యశోద అన్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం మండలంలోని మామిడిపల్లిలో సువ్వాడ గణేష్ జీవామృతంతో పండిస్తున్న పంటలను క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సత్యనారాయణ, బాలకృష్ణలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుకు పలు సలహాలు సూచనలు అందించారు.

వరిలో తెగులు నివారణకు మెలకువలు పాటించాలి


తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరిచేనులో ఆశిస్తున్న తెగులు నివారణకు గాలి వెలుతురు తగిలేలా మెలకువలు పాటించాలని ఎంఏఓ ఎస్.అవినాష్ అన్నారు. జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా సోమవారం సూరంపేట గ్రామంలో తాడుఉడుపు ద్వారా నాటిన వరి పంటను క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ దమ్ము చేసిన సమయంలో తూర్పు పడమర దిశలో తాడు ఊడుపు చేయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల ఉధృతి తగ్గుతుందని తెలియజేశారు. అదేవిధంగా వరిపంట వరుసలలో వేయడం వల్ల మొక్కలు, కుదుళ్ల మధ్య తగినంత దూరం (25 సె'మి' "25 సెమి') ఉండడంతో చదరపు మీటర్‌కు 33 కుదుళ్లు ఉండి దాదాపు 15-20% దిగుబడి అధికంగా వస్తుందన్నారు. తాడు ఉడుపు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించి, పంట దిగుబడి పెంచుకోవడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచవచ్చని చెప్పారు. ఆదేవిధంగా వేరు వ్యవస్థ బలంగా ఉండడం వల్ల అధిక గాలులకు వరిచేను పడిపోకుండా ఉంటుంది. ముఖ్యంగా ఈ విధానం వల్ల మొక్కల మధ్య, వరుసల మధ్య ఖాళీ ఉండడంతో కలుపు నివారణకు, సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వాకాడ ఇందిర



పార్వతీపురంటౌన్: ప్రజలకు మేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించేందుకు సిద్ధమయ్యారంటూ మహిళా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వాకాడ ఇందిర మాట్లాడారు. నూతన మద్యం పాలసీ ద్వారా రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు తెరలేపడం దుర్మార్గపు చర్య అంటూ మండిపడ్డారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బెల్టుషాపుల రద్దుకు మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేశాయని గుర్తు చేశారు. నాణ్యమైన మద్యం తక్కువ ధరకు సరఫరా చేస్తామంటూ టెండర్లకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. మాదక ద్రవ్యాలు నిర్మూలించాలంటే మద్యపానం పెంచాలని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ మద్యం పాలసీని ఆదర్శంగా తీసుకోవడం సరికాదని, మద్యపాన నిషేధానికి బీహార్, తమిళనాడు, కేరళ ప్రయత్నాలు చేస్తున్నాయని, ఆ రాష్ట్రాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రివర్గ కమిటీ అక్కడి మద్యం పాలసీపై ఇచ్చిన నివేదిక బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. దీన్ని బట్టి చూస్తే ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం విస్మరిస్తోందనే విషయం స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చి ప్రజల మానప్రాణాలతో ఆటలాడాలని చూస్తోందని మండిపడ్డారు.

సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పార్వతీపురం: సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టర్ ఆఫీస్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు డి.పండు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ బాలురు, బాలికల కళాశాలలకు సొంత వసతిగృహాలు ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు, ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాలురు, బాలికల వసతి గృహల్లో అదనపు భవనాలు నిర్మించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్. సింహాచలం, కె.డేవిడ్, జి.సురేష్,చంటి, వెంకీ, అభి, శ్రీను తదితరులు ఉన్నారు.

స్వర్ణాంధ్రకోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్


స్వర్ణాంధ్ర విజన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధన కోసం.. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో స్వర్ణాంధ్ర- 2047 విజన్ అభివృద్ధి కోసం సమగ్ర కసరత్తు చేపట్టిందని పేర్కొన్నారు. నవంబరు 1వ తేదీన విజన్-2047 పత్రాన్ని ఆవిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ఈ నెల 30వ తేదీలోగా మండల విజన్ ప్రణాళికలు, అక్టోబర్ 15 వతేదీ లోగా జిల్లా విజన్ ప్రణాళికలు రూపొందిస్తాయని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047పై గ్రామసభల ద్వారా, ముఖ్యమంత్రి వీడియో సందేశం ద్వారా, కరపత్రాల ద్వారా, పోస్టర్ల ద్వారా ప్రతి ఇంటికీ సమాచారం చేరవేయడం ద్వారా అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్. రాణి, సీపీఓ పి. వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి


పారిశుధ్య పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా ఆస్పత్రి వెనుక ఉన్న వీధులు, గూడ్స్‌షెడ్ సెంటర్ రోడ్డు వీధిలో పారిశుధ్య పనుల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడడంతో పారిశుధ్య లోపం తీవ్రత ఇంకా ఎక్కువవుతోందని, ఇప్పటికే ఎన్నోసార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినప్పటికీ కనీసం స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికే మున్సిపాలిటీలో పారిశుధ్య లోపంపై అన్ని పత్రికల్లో రోజువారీ కథనాలు వచ్చినా అధికారులు ఏమీ పట్టన్నట్లు ఉండడం శోచనీయమన్నారు. ఇదే కాకుండా కుళాయిల ద్వారా బురద నీరు రావడంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఎన్నో అవస్థలు పడుతుండడం రోజు చూస్తూనే ఉన్నామని, అయినా మున్సిపల్ అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమని ఎద్దేవా చేశారు. రానున్న కొద్ది రోజుల్లో సీపీఐ ఆధ్వర్యంలో పట్టణమంతా పర్యటించి పారిశుధ్యంపై మున్సిపల్ ఆఫీసు ముందు పట్టణ ప్రజలతో కలిసి నిరసన తెలియజేయనున్నట్లు స్పష్టం చేశారు.

కూరగాయలు, ఆకుకూరల విత్తనాల పంపిణీ


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: బడితోట కార్యక్రమంలో భాగంగా బలిజిపేట మండలంలోని పాఠశాలల ఆవరణలో ఆకుకూరలు, కూరగాయల పెంపకానికి ఆయా విత్తనాలను ఎంఈఓ-1సామల సింహాచలం ప్రధానోపాధ్యాయులకు సోమవారం పంపిణీ చేశారు. పాఠశాలల ఆవరణలో ఆకుకూరలు, కాయగూరల విత్తనాలను వేసి మంచి పోషక ఆహారాన్ని పెంచి మధ్యాహ్నభోజన పథకంలో వాటిని వినియోగించి విద్యార్థులకు పోషకాహారం అందించాలని ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ కోరారు. పాఠశాలల వద్ద ఇటువంటి వాటిని పెంచడం వల్ల విద్యార్థులకు మంచి వాతావరణం అందించిన వారమవుతామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు


షాపుల వద్ద ప్రచారం చేస్తున్న అధికారులు

బలిజిపేట: మండల కేంద్రం బలిజిపేటలో ప్లాస్టిక్ వినియోగంపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ప్లాస్టిక్ గ్లాసులు, పాలిథిన్ కవర్లు, వాటర్‌ప్యాకెట్లు అమ్మిన, వినియోగించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లు ఈఓపీఆర్‌డీ రవికుమార్ తెలిపారు. షాపుల వద్ద విక్రయించవద్దని ప్రతిషాపు యజమానికి సూచిస్తున్నారు. కాదని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేస్తున్నారు. విక్రయించే వారితో పాటు వినియోగించేవారికి హెచ్చరికలు జారీ చేశారు. విక్రయించేవారికి రూ.500, వినియోగించేవారికి రూ.1,000అపరాధ రుసుము విధించనున్నట్లు తెలిపారు. దీనిని గమనించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆదిలక్ష్మి, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

- హామీలు అమలు చేయాలని రైతుల డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పలుగ్రామాల రైతులు, రైతుసంఘం నాయకులు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయంగా ఇస్తామని హామీ ఇచ్చిన రూ.20 వేలు తక్షణమే జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతుల కిచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని కోరుతూ రాజకీయాలకు అతీతంగా రైతులతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరినాట్లు వేయక ముందే వ్యవసాయ పెట్టుబడి కింద రూ.20వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ అమలు చేయకపోవడం వల్ల దమ్ముల సమయంలో పెట్టుబడి లేక అప్పులు చేసి వరి ఊబాలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. అప్పులు తీర్చడానికి 60 రోజులు కావస్తున్నా ఇంతవరకూ పెట్టుబడి సహాయం అందకపోవడంతో రైతాంగం అప్పుల పాలు కావాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతన్నకు అండగా ఉంటామని నమ్మబలికిన చంద్రబాబు ప్రభుత్వం ఇంతవరకూ రైతులకోసం ఏమిచేసిందో తెలియజేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు సాగు చేస్తున్న పంటలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని, రైతు రుణాల బకాయి రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలి. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం నడపాలి. వెంగళరాయసాగర్ కాలువ ద్వారా నీరు కోటసీతారాంపురం, జానుమల్లువలస, గాదెలవలస, దయానిధిపురం, వెన్నెలబుచ్చింపేట గ్రామాలకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ జె.రాములమ్మకు అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా, మండల నాయకులు ఆర్‌వీ రమణమూర్తి, ఆర్.ఈశ్వరరావు, బి.అప్పారావు, పి.కాశీవిశ్వనాథం, ఆర్.సత్యనారాయణ, పి.సత్యం, పి.ఎరుకునాయుడు, టి.శ్రీనివాసరావు, ధనుంజయరావు, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సాలూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత జూలై 18న జరగాల్సిన సర్వసభ్య సమావేశం ప్రత్యేక కారణాల వల్ల వాయిదా పడిందని, అయితే అదే రోజున ప్రత్యేక సమావేశం నిర్వహించి అధికారులతో పలు అంశాలపై చర్చించామన్నారు. నేడు జరగనున్న సర్వసభ్యసమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

అక్టోబర్ 1న చలో కలెక్టరేట్


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలు, ఐద్వా నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి పట్టణంలోని ఎన్జీఓ హోంలో స్వచ్ఛంద సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నీటి సమస్యను అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం అన్యాయమని, ఈ సమస్యను పరిష్కరించ పోతే ఈ నెల 25 నుంచి 28 వరకు రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అనంతరం అక్టోబర్ 1న కలెక్టరేట్ ముట్టడి చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ, సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజశేఖర్. వెంకటరమణ, జి తులసి, పాకల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.